నమస్తే తెలంగాణ
సిద్దిపేట
13 | హైదరాబాద్, గురువారం 21 మార్చి 2024 | SIDDIPET

ఆన్‌లైన్‌లో ఆర్జిత సేవలు

టీ-యాప్ పోలియోలో కొమురవెల్లి మల్లన్న ఆలయ 12 సేవా టికెట్ల బుకింగ్

- ఆన్‌లైన్ సేవలపై ఆసక్తి చూపని భక్తులు
- సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్న ఆలయవర్గాలు

చేర్యాల, మార్చి 20: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ఆర్జిత సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నప్పటికీ భక్తులు సద్వినియోగం చేసుకోవడం లేదు. టీ-యాప్ పోలియోలో 12రకాల సేవా టికెట్లు బుకింగ్ చేసుకునేందుకు అవకాశమున్నది. అయిన్నప్పటికీ భక్తులు ఆలయానికి వచ్చి గంటల పాటు తమ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. ఏడాదిలో మూడు నెలల సుదీర్ఘకాలంపాటు రాష్ట్రంలో ఏ ఆలయంలో లేనివిధంగా కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. మూడు నెలల పాటు జరిగే ఉత్సవాలకు ప్రతి ఆదివారం 50వేల మందికి పైగా, ప్రతి బుధవారం 20వేల మందికి పైగా, మిగిలిన రోజుల్లో ప్రతి ఆదివారం 10వేలకు పైగా భక్తులు దర్శించుకుంటారు. సాంకేతికత పెరగడంతో ప్రతి ఒక్కరి వద్ద స్మార్ట్‌ఫోన్ ఉన్న నేపథ్యంలో ఆన్‌లైన్ సేవలు వినియోగించుకోవాలని ఆలయ వర్గాలు కోరుతున్నాయి. దేశంలో ప్రముఖ ఆలయాల్లో ఉన్న ఆన్‌లైన్ సేవల విధానాన్ని కొమురవెల్లిలో ప్రవేశపెట్టాలని గత దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ నిర్ణయించి రూపకల్పన చేయించారు.

ఇంటి నుంచే సేవల బుకింగ్

కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వచ్చే భక్తులు ఆర్జిత సేవలు, మొక్కుబడుల టికెట్ల కోసం గంటల తరబడి క్యూలో నిలబడి ఇబ్బందులు పడుతున్నారు. ఇక నుంచి ఇంటి నుంచే ఆర్జిత సేవలు, మొక్కుబడి సేవల టికెట్లు పొందవచ్చు. గతేడాది ఫిబ్రవరిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయ ఈవో బాలాజీ ప్రత్యేక శ్రద్ధ వహించి సేవలు టీ-యాప్ పోలియో యాప్‌లో నమోదు చేయించారు. టీ-యాప్ పోలియో ఓపెన్ చేస్తే ఎండోమెట్స్ రాగానే, అందులో రాష్ట్రంలోని ఆలయాల వివరాలు ఉంటాయి. అందులో కొమురవెల్లి మల్లన్న ఆలయ సేవల్లోకి వెళ్లి వాటిలో సేవలు నమోదు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లో 12 రకాల సేవలు

T App Folio

కొమురవెల్లి మల్లికార్జున స్వామికి సంబంధించి 25 మొక్కుబడి, ఆర్జిత సేవలు ఉండగా, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో 12 రకాల సేవలు ఆలయవర్గాలు అందుబాటులోకి తెచ్చాయి. స్వామివారికి అభిషేకం, చెలుక పట్నం, కుంకుమార్చన, ముఖమండప పట్నం, నజరుపట్నం, శాశ్వత కల్యాణం, శాశ్వత పూజ, స్వామివారి నిత్య కల్యాణం, తిరుగుడ కోడె, వీవీఐపీ దర్శనం, ఎల్లమ్మ అర్చన, ఎల్లమ్మ పట్నం సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో భక్తులు టీ-యాప్ పోలియోలో సులువుగా సేవలు బుక్ చేసుకుని నేరుగా ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకోవచ్చు. అవగాహన లేక కొంతమంది భక్తులు మాత్రమే ఆన్‌లైన్ సేవలు వినియోగించుకుంటున్నారు. స్వామివారి ఆర్జిత సేవలు, మొక్కుబడుల సేవలే కాకుండా కాటేజీలు, ప్రసాదాలు విక్రయ టికెట్లు తదితర సేవలను సైతం అందుబాటులోకి తీసుకురావాలని ఆలయవర్గాలు యోచిస్తున్నట్లు ఈవో బాలాజీ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.

2806 ఎకరాల్లో పంట నష్టం

- సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

సిద్దిపేట అర్బన్, మార్చి 20: సిద్దిపేట జిల్లాలో మంగళవారం రాత్రి కురిసిన భారీ అకాల, వడగండ్ల వర్షానికి 1,794 మంది రైతులకు చెందిన 2,806.5 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు ప్రాథమికంగా గుర్తించామని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సుమారు 11 మండలాల్లోని పలు గ్రామాల్లో వివిధ రకాలు పంటలు నష్టపోయినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఇందులో వరి 405 మంది రైతులకు చెందిన 600 ఎకరాల్లో నష్టపోగా.. మొక్కజొన్న 765 మంది రైతులకు చెందిన 1405.5 ఎకరాలు, పొద్దు తిరుగుడు 65 మంది రైతులకు చెందిన 98 ఎకరాల్లో పంటలు నష్టపోయాయి. 353 మంది రైతులకు చెందిన 289 ఎకరాల్లో కూరగాయ తోటలు, 206 మంది రైతులకు చెందిన 414 ఎకరాల మామిడి తోటలు అకాల వర్షానికి ధ్వంసమైనట్లు జిల్లా వ్యవసాయాధికారి తెలిపారు.

ఆశీర్వదించండి.. కష్టసుఖాల్లో తోడుంటా

జహీరాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి కృషి చేస్తా.. ప్రజలకు కాంగ్రెస్ నిజస్వరూపం తెలిసిపోయింది

- కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు
- ఎన్నికల్లో కారును గెలిపించాలని ప్రజలు నిర్ణయించుకున్నారు
- జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్



మామిడ్గిలో గాలి అనిల్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న మండల నాయకులు, కార్యకర్తలు



మామిడ్గిలో గాలి అనిల్‌కుమార్‌కు సన్మానిస్తున్న మండల నాయకులు, కార్యకర్తలు

న్యాల్‌కల్, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి ఓటేసి కష్టాలు కొని తెచ్చుకోవద్దని, తనను గెలిపిస్తే కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని మామిడ్గి గ్రామ శివారులోని ఎస్ఎస్‌వీ రెస్టారెంట్ కన్వెషన్‌హాల్‌లో బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నూరు రవీందర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గాలి అనిల్‌కుమార్‌కు గజమాలతో ఘనస్వాగతం పలికారు. ఆయనకు జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మానిక్‌రావు గ్రామాల వారీగా పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలను పరిచయం చేశారు. అనంతరం గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఎంపీగా తనను గెలిపిస్తే సేవకుడిలా పనిచేస్తూ జహీరాబాద్ అభివృద్ధికి కృషిచేస్తానని వెల్లడించారు. గ్యారెంటీ పథకాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిజస్వరూపం ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించుకోవాలని ప్రజలు నిర్ణయించుకున్నట్లు చెప్పారు. నాయకులు, కార్యకర్తలందరూ కష్టపడి పనిచేస్తే జహీరాబాద్ నుంచి భారీ మెజార్టీని సాధించే అవకాశం ఉందన్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మానిక్‌రావు మాట్లాడుతూ.. గాలి అనిల్‌కుమార్ భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, మండల నాయకులు నర్సింహారెడ్డి, భాస్కర్, వీరారెడ్డి, సంగ్రాంపాటిల్, రాజ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, భూంరెడ్డి, శివకుమార్‌స్వామి, సత్యనారాయణ, మాణిక్‌రెడ్డి, ఎల్లారెడ్డి, సిద్ధారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లప్ప, అప్పారావు పాటిల్, దేవదాస్, మంగలి మహేశ్, హనీఫ్, వెంకట్‌రెడ్డి, గౌసోద్దీన్, మాజీ సర్పంచులు రవికుమార్, మహిపాల్, చంద్రన్న, మారుతీ యాదవ్, అమీర్, మల్లారెడ్డి, కుతుబొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం

- భెల్ చౌరస్తాలో ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ
- సందడి చేసిన ప్రముఖ సినీహీరో రామ్ పోతినేని

భెల్ చౌరస్తాలో సీఎంఆర్ షాపింగ్ మాల్‌ని ప్రారంభిస్తున్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పక్కన సంస్థ చైర్మన్ ఎంవీ.రమణ

రామచంద్రాపురం, మార్చి 20 : భెల్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ని బుధవారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రముఖ సినీహీరో రామ్ పోతినేని ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీఎంఆర్ సంస్థ చైర్మన్ ఎంవీ రమణతో కలిసి మంత్రి షాపింగ్‌మాల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రికి సంస్థ యాజమాన్యం ఘన స్వాగతం పలికింది. షాపింగ్ మాల్ ప్రారంభం అనంతరం మంత్రి కలియ తిరుగుతు వస్త్రాలను పరిశీలించారు. చైర్మన్ ఎంవీ రమణ మంత్రికి శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. ఆ తర్వాత వచ్చిన సినీ హీరో రామ్ పోతినేనికి సంస్థ మేనేజ్‌మెంట్ ఘన స్వాగతం పలికింది. అనంతరం ఆయన షాపింగ్ మాల్‌లో కలియ తిరిగారు. ఆయన్ను తమ ఫోన్‌లో బంధించేందుకు అభిమానులు పోటీపడ్డారు. చైర్మన్ ఎంవీ రమణ హీరో రామ్ పోతినేనిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం రామ్ మీడియాతో మాట్లాడిన తర్వాత షాపింగ్ మాల్ బయట సందడి చేశారు. అభిమానులతో సరదాగా మాట్లాడి వారిని అలరించారు. ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎంవీ రమణ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్ద వస్త్ర వ్యాపార సంస్థగా సీఎంఆర్ ఎదిగిందన్నారు. సీఎంఆర్ సంస్థ వినియోగదారుల అభిమానాన్ని చూరగొని వస్త్ర వ్యాపారంలో దూసుకుపోతున్నట్లు చెప్పారు. అన్నివర్గాల ప్రజలు సీఎంఆర్‌లో షాపింగ్ చేసుకునేలా ధరలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వినియోగదారులకు సరసమైన ధరలకే వస్త్రాలు విక్రయిస్తూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని తెలిపారు. భెల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సీఎంఆర్ బ్రాంచ్ సక్సెస్‌ఫుల్‌గా నడుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ మోహన్‌బాలాజీ, జీఎం లింగమూర్తి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ సి.జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు జె.రాజు, నదీం ఉల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణను పరిశీలిస్తున్న ఐజీ సుధీర్‌బాబు

అక్రమ రవాణాను అడ్డుకోవాలి

- ఐజీ సుధీర్‌బాబు

సంగారెడ్డి, మార్చి 20: జిల్లాలో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సరిహద్దుల్లో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెంచుతామని ఐజీ సుధీర్‌బాబు అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ఆయన సందర్శించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణ, పోలీసు పరేడ్ గ్రౌండ్, మోటార్ వెహికిల్ సెక్షన్, నూతనంగా ప్రారంభించిన పోలీసు క్యాంటీన్, వాటర్ ప్లాంట్లను ఎస్పీ చెన్నూరి రూపేశ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో ఐజీ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో డబ్బు, మద్యం అక్రమ రవాణా జరుగకుండా అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లాల సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ప్రతి చెక్‌పోస్ట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జిల్లా కేంద్రం నుంచి పర్యవేక్షణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టద్దొని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పోలీసు అధికారులతో ఐజీ సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ప్రజలకు ఏదైనా సమస్య వస్తే త్వరితగతిన స్పందించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది ఎవరూ హెడ్ క్వార్టర్స్‌ను వదిలి వెళ్లొద్దని, 24/7అందుబాటులో ఉండాలని ఐజీ సుధీర్‌బాబు ఆదేశించారు.

ఆర్ఆర్ఆర్‌కు సాగు భూములివ్వం

గజ్వేల్ ఐవోసీ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

గజ్వేల్ ఐవోసీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

గజ్వేల్, మార్చి 20: రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్)నిర్మాణానికి తమ సాగు భూములు ఇవ్వబోమని బుధవారం గజ్వేల్ ఐవోసీ కార్యాలయం ఎదుట మర్కూక్ మండలం నర్సన్నపేట, చెబర్తి గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చేపట్టారు. ఆ రెండు గ్రామాల మీదుగా ఆర్ఆర్ఆర్ పోతున్న నేపథ్యంలో రైతులతో ఆర్డీవో బన్సీలాల్ సమావేశం ఏర్పాటు చేసి భూసేకరణపై మాట్లాడారు. రైతులకు పరిహారం విషయంపై చర్చించారు. ఎకరాకు రూ.7లక్షలు చెల్లిస్తామని, అందుకు రైతులు అంగీకరించాలని కోరడంతో రైతులు అంగీకరించకుండా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు భీంరెడ్డి రాంరెడ్డి, ఎంబరి వెంకటేశం, రాంరెడ్డి, ఉడేం శివారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అధికారులు చేసిన మొదటి అలైన్‌మెంట్ ప్రకారం ఆర్ఆర్ఆర్ నిర్మించాలని, అందుకు అధికారులు తమ గ్రామాన్ని ఎంచుకోవద్దన్నారు. గుంట భూమి అమ్మితే రూ.7లక్షలు వస్తాయని, అలాంటిది ఎకరాకు రూ.7లక్షలు ఇస్తామంటే నష్టపోతామన్నారు. తమ గ్రామాల మీదుగా రోడ్డు నిర్మాణం చేయాలనుకుంటే భూమికి భూమి, ఎకరానికి 500 గజాల ప్లాట్ ఇవ్వాలన్నారు. వ్యవసాయ భూములు తీసుకుంటే తమ బతుకుదెరువు ఎలా? అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

మెదక్ జిల్లా అల్లాదుర్గంలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

ఆలయ అభివృద్ధికి కృషి

- మంత్రి దామోదర రాజనర్సింహ

అల్లాదుర్గం, మార్చి 20: మెదక్ జిల్లా అల్లాదుర్గంలోని వేంకటేశ్వర ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని వైద్య ఆరోగ్య శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆలయంలో నూతన ధ్వజస్తంభ స్థాపన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రిచే వేదపండితుడు ప్రవీణ్ శర్మ ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అంజియాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు బల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకుంటాం

ధ్వంసమైన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నిజాంపేట, మార్చి 20: వడగండ్ల వానకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని జడ్పెరువు, బచ్చురాజ్‌పల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. అకాల వర్షం కారణంగా దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఇటీవల నిజాంపేటలో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన బక్కొల్ల మల్లయ్య కుటుంబీలను ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు నసీరొద్దీన్, మూరుతి, ముత్యంరెడ్డి, వెంకటేశ్ గౌడ్, మధుసూదన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, లక్ష్మణ్, మసూద్, మహేశ్, రాజయ్య, శ్రీకాంత్, భూమగౌడ్, బాలయ్య, నరేందర్, బాబు తదితరులు ఉన్నారు.

పాండురంగ నామం.. పరమ పుణ్యధామం

భక్తుల కొంగుబంగారం మాసాయిపేట రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయం

- ఒకే గర్భాలయంలో దేవతామూర్తులు
- సంతాన ప్రదాత, కల్యాణ కారకుడు, వీసాల దేవుడిగా భక్తుల నమ్మకం
- మూడు శతాబ్దాల చరిత్ర కలిగిన క్షేత్రం
- నేడు 20వ వార్షికోత్సవం

రుక్మిణీ పాండురంగ స్వామి ఉత్సవమూర్తులు

మాసాయిపేటలోని రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయం

వెల్దుర్తి, మార్చి 20: మెదక్ జిల్లా మాసాయిపేటలోని మరకత లింగ శివపంచాయతన రుక్మిణీ పాండురంగ స్వామి దేవాలయం భక్తుల పాలిట కొంగుబంగారంగా.. మరో పండరీపురంగా విరాజిల్లుతున్నది. మూడు శతాబ్దాల చరిత్ర గల ఈ ఆలయం కల్యాణార్థుల పాలిట కల్పతరువుగా, సంతానాన్ని ఇచ్చే ప్రదాత, కోరిన కోర్కెలు తీర్చే క్షేత్రంగా భక్తుల నమ్మకం. పాత దేవాలయం శిథిలావస్థకు చేరగా 2004లో దేవాలయాన్ని పునరుద్ధరించి మరకత లింగంతో పాటు రుక్మిణీ పాండురంగ స్వామి దేవతామూర్తులను పునఃప్రతిష్ఠ చేసి నిత్యం ధూపదీప నైవేద్యాలతో పూజాధికాలు నిర్వహిస్తున్నారు.

ఘనమైన చరిత్ర...

హరిద్రా నది(ప్రస్తుత హల్దీవాగు)కి సమీపంలో మాసాయిపేటలో ఉన్న రుక్మిణీ పాండురంగ స్వామి దేవాలయం 300ఏండ్ల ఘన చరిత్ర కలిగి ఉంది. నిత్యం పూజలందుకుంటూ దేదీప్యమానంగా వెలుగొందుతున్నది. అన్నదానం రాఘవులు అనే భక్తుడు ఆలయ పోషణకు కంకణం కట్టుకొని నిత్యం ధూపదీప నైవేద్యాలను అందించారు. తదనంతరం వేద బ్రాహ్మణుడు కాసుల రామచంద్రయ్య ఆలయ బాధ్యతలు స్వీకరించి నిత్యం పూజాధికాలు, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. తర్వాతి కాలంలో సన్యసించిన కాసుల రామచంద్రయ్య శ్రీయతివర అఖండానంద సరస్వతి స్వామీజీగా హల్దీవాగుకు అవతలి వైపు సీతారామచంద్ర ఆశ్రమాన్ని స్థాపించి, రామ సాక్షాత్కారం పొంది, సమాధి అయ్యారు. వారి వంశస్తుల ఆధ్వర్యంలో 2004లో ఆలయాన్ని పునర్నిర్మించి మరకత లింగ శివపంచాయతన ఆలయంలోని దేవతా మూర్తులను పున:ప్రతిష్ఠ చేశారు. ఒకే గర్భాలయంలో హరిహరులు, పాండురంగడు, శివ లింగం దర్శనమిచ్చే విశిష్ట ఆలయం మాసాయిపేట రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయం.

కోరిన కోర్కెలు తీర్చే ఆలయం...

రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయం భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా వెలుగొందుతున్నది. పెళ్లి కాని వారు ఆలయంలో మొక్కుకొని వెళ్తే ఏడాదిలోపు వివాహాలు కావడం, సంతానం లేని వారు స్వామివారిని బుధ, శని వారాల్లో దర్శించుకుంటే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కుకొని వెళ్లి, ప్రచారాలు చేస్తే విజయం కలుగుతుందని నమ్ముతారు. ఉన్నత విద్య అభ్యసించాలన్నా, విదేశాలకు వెళ్లాలన్నా విద్యార్థులు పాండురంగ స్వామిని దర్శించుకుంటే తప్పక నెరవేరుతాయని నమ్మకం.

20వ వార్షికోత్సవానికి ఆలయం ముస్తాబు

ఆలయం పునర్నిర్మించినప్పటి నుంచి ఏటా వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. 20వ వార్షికోత్సవాన్ని గురువారం(నేడు) నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు హరిరంజన్ శర్మ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వస్తివాచనం,అఖండ దీపస్థాపన, గణపతిపూజ, రుక్మిణీ పాండురంగ స్వామికి పురుషసూక్త, లక్ష్మీసూక్తాదులచే అభిషేకం, మరకత లింగానికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, పూర్ణాహుతి, రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు. భక్తులు హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.



సిద్దిపేటలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

హామీలు విస్మరించిన కాంగ్రెస్‌కు ఓటేయొద్దు

- బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందర్‌రావు

గజ్వేల్/సిద్దిపేట అర్బన్, మార్చి 20: అలవి కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఎంపీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట, గజ్వేల్‌లో నిర్వహించిన రెండు నియోజకవర్గాల బీజేపీ కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని ఆరోపించారు. ఓడిపోయిన అభ్యర్థులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. దీన్ని తెలంగాణ సమాజం సహించదన్నారు. అధికారంలోకి రాగానే రూ.2 లక్షల పంట రుణాలు మాఫీ చేస్తానని, రూ.4 వేల పెన్షన్ ఇస్తానని చెప్పి.. మూడు నెలలైనా చేయలేదని విమర్శించారు. రూ.4 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని స్వయంగా రాహుల్‌గాంధీ సమక్షంలోనే చెప్పారని, ఎందుకు చేయట్లేదని ప్రశ్నించారు. బీజేపీతోనే దేశం బలంగా ఉంటుందని, బీజేపీకి ఓటేసి గెలిపించాలని ప్రజలకు రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, మహేశ్, కిరణ్, సత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.